**06-10-2023** ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - స్మృతిలో ఉండేందుకు ఎటువంటి అభ్యాసం చేయండంటే, ఇక అంతిమంలో ఒక్క తండ్రి తప్ప ఇంకెవ్వరూ గుర్తుకు రాకూడదు"

ప్రశ్న:- ఏ ఒక్క శ్రీమతాన్ని పాలన చేయడం ద్వారా పిల్లలైన మీరు అదృష్టవంతులుగా అవ్వగలుగుతారు?

జవాబు:- తండ్రి శ్రీమతం ఏమిటంటే - పిల్లలూ, నిద్రను జయించేవారిగా అవ్వండి. ఉదయం యొక్క సమయం చాలా బాగుంటుంది. ఆ సమయంలో లేచి తండ్రినైన నన్ను స్మృతి చేసినట్లయితే మీరు అదృష్టవంతులుగా అయిపోతారు. ఒకవేళ ఉదయముదయమే లేవకపోతే, ఎవరైతే పడుకుంటారో వారు పోగొట్టుకుంటారు. కేవలం పడుకోవడము మరియు తినడమే అంటే అది పోగొట్టుకోవడమే, అందుకే ఉదయాన్నే లేచే అలవాటు చేసుకోండి.

పాట:- నీవు నిదురించి రాత్రిని పోగొట్టుకున్నావు... (తూనే రాత్ గవాయీ సో కే...)

ఓం శాంతి. ఈ కథ పిల్లల గురించే ఉంది. తండ్రి అంటారు, పిల్లలూ, తినడము మరియు పడుకోవడము, ఇదేమీ జీవితం కాదు. పిల్లలైన మీకు ఈ అవినాశీ జ్ఞాన రత్నాల దానము లభిస్తుంది అన్నప్పుడు, మీ జోలె నిండుతోంది అన్నప్పుడు, ఇక పడుకోవడము మరియు తినడము అంటే అది పోగొట్టుకోవడమే. ఉదయాన్నే లేవడానికి ఎంతో మహిమ ఉంది, అది భక్తి మార్గంలోనైనా లేక జ్ఞాన మార్గంలోనైనా, ఎందుకంటే ఉదయం యొక్క సమయంలో చాలా శాంతి ఉంటుంది. ఆత్మలందరూ తమ స్వధర్మంలో ఉంటారు. అశరీరిగా అయి విశ్రాంతిని పొందుతారు. ఆ సమయంలో స్మృతి ఎంతగానో ఉంటుంది. పగలు అయితే మాయ యొక్క గందరగోళం ఉంటుంది, ఈ సమయం ఒక్కటే మంచిది. ఇప్పుడు మనము గవ్వ నుండి వజ్రము వలె అవుతున్నాము. మీరు నా పిల్లలు, నేను మీ బిడ్డను అని తండ్రి పిల్లలతో అంటారు. తండ్రి బిడ్డగా అవుతారు, ఇది కూడా అర్థం చేసుకోవాల్సిన విషయం. తండ్రి తమ పిల్లలకు వారసత్వాన్ని ఇస్తారు. అలాగే నేను వ్యాపారిని కూడా. గవ్వతుల్యమైన మీ తనువు, మనస్సు, ఇవన్నీ పైసకు కూడా కొరగానివి. వారు మీ పాతవన్నింటినీ తీసుకొని మళ్ళీ మీకే ట్రస్టీగా అయి సంభాళించమని ఇచ్చేస్తారు. మీరు - బలిహారమవుతాను అని జన్మజన్మాంతరాలుగా పాడుతూ వచ్చారు. మాకైతే ఒక్కరే, ఇంకెవ్వరూ లేరు, ఎందుకంటే అందరూ ప్రేయసులే. కావున ఒక్క ప్రియుడినే తలచుకుంటారు. దేహ సహితంగా సర్వ సంబంధాలను మర్చిపోతూ-మర్చిపోతూ ఒక్కరి స్మృతే ఎంతగా ఉండాలంటే, ఇక అంతిమంలో ఈ శరీరము గాని లేక ఇంకెవరైనా గాని గుర్తుకు రాకూడదు. అంతటి అభ్యాసము చేయాలి. ఉదయం సమయం చాలా మంచిది. ఇది మీ సత్యాతి-సత్యమైన యాత్ర. వారైతే జన్మజన్మాంతరాలుగా యాత్రలు చేస్తూ వచ్చారు, కానీ ముక్తినైతే పొందలేదు, కావున అవి అసత్యమైన యాత్రలు అయినట్లు కదా. ఇది ఆత్మికమైన మరియు సత్యమైన ముక్తి మరియు జీవన్ముక్తుల యాత్ర. మనుష్యులు తీర్థ యాత్రలకు వెళ్ళినప్పుడు అమర్ నాథ్, బద్రీనాథ్ మొదలైనవి గుర్తుంటాయి కదా. విశేషంగా నాలుగు ధామాలు గురించి చెప్తారు. మీరు ఎన్ని ధామాలకు వెళ్ళి ఉంటారు! ఎంత భక్తి చేసి ఉంటారు! అర్ధకల్పము భక్తి చేస్తూ వచ్చారు. ఇప్పుడు ఈ విషయాల గురించి ఎవ్వరికీ తెలియదు. తండ్రియే వచ్చి విముక్తులుగా చేసి మళ్ళీ మార్గదర్శకునిగా అయి తమతోపాటు తీసుకువెళ్తారు. ఎంత అద్భుతమైన మార్గదర్శకుడు. పిల్లలను ముక్తి-జీవన్ముక్తి ధామాలకు తీసుకువెళ్తారు. ఇటువంటి మార్గదర్శకుడు ఇంకెవ్వరూ ఉండరు. సన్యాసులు కేవలం ముక్తిధామము అనే అంటారు, జీవన్ముక్తి అనే మాట వారి నోటి నుండి రాదు. దానిని వారు కాకిరెట్టతో సమానమైన అల్పకాలిక సుఖముగా భావిస్తారు. తండ్రి దుఃఖహర్త, సుఖకర్త అని పిల్లలైన మీకు తెలుసు. ఓ తల్లి-తండ్రి, మీకు మేము పిల్లలుగా అయినప్పుడు మా దుఃఖాలన్నీ దూరమైపోతాయి. అర్ధకల్పానికి మేము సుఖవంతులుగా అయిపోతాము. ఇది బుద్ధిలో ఉంటుంది కదా. కానీ వ్యాపార-వ్యవహారాలు మొదలైనవాటిలోకి వెళ్ళడంతో మర్చిపోతారు. ఉదయాన్నే లేవరు. ఎవరైతే పడుకుంటారో వారు పోగొట్టుకుంటారు.

తప్పకుండా మనకు వజ్రతుల్యమైన జన్మ లభించిందని మీకు తెలుసు. ఇప్పటికీ ఒకవేళ నిద్ర నుండి ఉదయాన్నే లేవకపోతే, వారు అదృష్టవంతులు కారని భావిస్తారు. ఉదయాన్నే లేచి అతి ప్రియమైన తండ్రిని, ప్రియుడిని స్మృతి చేయరు. అర్ధకల్పము నుండి ప్రియుడు దూరమయ్యారు మరియు తండ్రిని మీరు మొత్తం కల్పమంతా మర్చిపోతారు, మళ్ళీ భక్తి మార్గంలో మీరు వారిని ప్రియుని రూపంలో మరియు తండ్రి రూపంలో తలచుకుంటారు. ప్రేయసి ప్రియుడిని కూడా తలచుకుంటుంది. వారిని తండ్రి అని కూడా అంటారు. ఇప్పుడు తండ్రి సమ్ముఖంగా ఉన్నారు కావున వారి

శ్రీమతంపై నడవాలి. ఒకవేళ శ్రీమతంపై నడవకపోతే పడిపోతారు. శ్రీమతము అనగా శివబాబా యొక్క మతము. ఎవరి మతము లభిస్తుందో మాకేం తెలుసు అని అనకూడదు. మీరు ఇచ్చే మతానికి కూడా వారే బాధ్యులు అని అర్థం చేసుకోవాలి. ఏ విధంగానైతే లౌకికములో పిల్లలకు తండ్రి బాధ్యులు, కొడుకు తండ్రిని ప్రత్యక్షం చేస్తాడు. ఈ బ్రహ్మ తనువు కూడా తండ్రిని ప్రత్యక్షం చేస్తుంది. ఇతను అల్లారుముద్దు బిడ్డ. మేము ఎవరి మతముపై నడుస్తున్నాము, డైరెక్షన్లు ఎవరు ఇస్తున్నారు అన్నది తెలియని మంచి-మంచి పిల్లలు చాలామంది ఉన్నారు. బాబానైతే స్మృతి చేయరు. ఉదయాన్నే లేవకపోతే, స్మృతి చేయకపోతే వికర్మలు కూడా వినాశనం కావు. బాబా అంటారు, నేను ఇంత శ్రమిస్తున్నా కూడా కర్మభోగము నడుస్తూనే ఉంటుంది ఎందుకంటే ఇది ఒక్క జన్మ యొక్క విషయము కాదు కదా. ఇవి అనేక జన్మల లెక్కాచారాలు. ఈ జన్మలోని పాపాలను చెప్పినా సరే సగం కట్ అవ్వగలవు అని డైరెక్షన్ లభించింది. ఇది నాకు తెలుసు మరియు ధర్మరాజుకు తెలుసు అని తండ్రి అంటారు. పాపాలు ఎన్నో చేసి ఉన్నారు. ధర్మరాజు గర్భ జైలులో శిక్షలను ఇస్తూ వచ్చారు. ఇప్పుడైతే మీరు పురుషార్థం చేసి, వికర్మలను వినాశనం చేసుకున్నట్లయితే తర్వాత గర్భ మహలు లభిస్తుంది. అక్కడ మనుష్యుల చేత పాపాలు చేయించేందుకు మరియు శిక్షలు తినవలసి వచ్చేందుకు మాయ ఉండదు. అర్థకల్పము ఈశ్వరీయ రాజ్యం ఉంటుంది, అర్థకల్పము రావణ రాజ్యం ఉంటుంది. సర్పము యొక్క ఉదాహరణ కూడా ఇక్కడిదే. దీనిని సన్యాసులు కాపీ చేసారు. ఎలాగైతే తండ్రి భ్రమరము యొక్క ఉదాహరణను ఇస్తారు. భ్రమరము పురుగులను తన ఇంటిలోకి తీసుకువస్తుంది. మీరు కూడా పతితులను తీసుకువస్తారు. తర్వాత వారిని కూర్చోబెట్టి శూద్రుల నుండి బ్రాహ్మణులుగా తయారుచేస్తారు. మీ పేరు బ్రాహ్మణి. ఈ భ్రమరము ఉదాహరణ చాలా బాగుంది. ప్రాక్టికల్ గా చాలామంది వస్తారు కానీ కొందరు అపరిపక్వముగా ఉండిపోతారు, కొందరు కుళ్ళిపోతారు, కొందరు సమాప్తమైపోతారు. మాయ చాలా పెద్ద తుఫానులు తీసుకొస్తుంది. నిజానికి మీరు ప్రతి ఒక్కరూ హనుమంతులు. మాయ ఎన్ని తుఫానులను తీసుకొచ్చినా మనము బాబాను మరియు స్వర్గాన్ని ఎప్పుడూ మర్చిపోము. బాబా ఘడియ-ఘడియ - అప్రమత్తంగా ఉండండి అని చెప్తారు! మనుష్యులు తీర్థ యాత్రలకు ఎదురుదెబ్బలు తినేందుకు వెళ్తారు. ఇక్కడైతే ఇంకెక్కడికీ వెళ్ళరు. ఒక్క తండ్రిని మరియు సుఖధామాన్నే స్మృతి చేస్తూ ఉండాలి. మీరు తప్పకుండా విజయాన్ని ప్రాప్తి చేసుకునేవారు. దీనిని బుద్ధియోగ బలము, జ్ఞాన బలము అని అంటారు. స్మృతి చేయడం ద్వారా శక్తి లభిస్తుంది, బుద్ధి తాళము తెరుచుకుంటుంది. ఒకవేళ ఏదైనా నియమ విరుద్ధమైన నడవడికను నడిచినట్లయితే వారి బుద్ధి తాళము మూసుకుపోతుంది. మీరు ఒకవేళ ఇలా చేసినట్లయితే డ్రామా అనుసారంగా బుద్ధి తాళము మూసుకుపోతుంది అని తండ్రి అర్థం చేయిస్తారు కూడా. అప్పుడిక - వికారాలలోకి వెళ్ళకండి అని ఎవ్వరికీ చెప్పలేరు. నేను ఇన్ని పాపాలు చేసాను అని - లోలోపల మనసు తింటూ ఉంటుంది. అజ్ఞానకాలంలో కూడా మనసు తింటుంది. మరణిస్తారు, ఆ తర్వాత క్షమించమని వేడుకుంటారు. మళ్ళీ చివరిలో అన్ని పాపాలు ఎదురుగా వస్తాయి. గర్భ జైలులోకి వెళ్ళిన వెంటనే శిక్షలు మొదలవుతాయి. చివరిలో తప్పకుండా గుర్తుకు వస్తాయి. కావున ఇప్పుడు తండ్రి అంటారు - మీరైతే క్షమాపణ వేడుకోవడం కాదు, మీరు పాపాలు చేయకండి. జైలు పక్షులు వలె ఉంటారు కదా. మీరు కూడా జైలు పక్షుల వలె ఉండేవారు. ఇప్పుడు బాబా గర్భ జైలు శిక్షల నుండి విడిపిస్తారు. తండ్రినైన నన్ను స్మృతి చేసినట్లయితే పాపాల శిక్షల నుండి విముక్తులైపోతారు, మీరు పావనులుగా అయిపోతారు అని అంటారు. ఒకవేళ మళ్ళీ పడిపోతే చాలా పెద్ద దెబ్బ తగులుతుంది. మొదటిది అశుద్ధ అహంకారము. ఆ తర్వాత కామము, క్రోధము. కామము మహాశత్రువు. ఇది మీకు ఆదిమధ్యాంతాలు దుఃఖాన్నిస్తూ వచ్చింది. మీరు ఆదిమధ్యాంతాలు సుఖము కొరకు పురుషార్థం చేస్తారు. కావున పూర్తి పురుషార్థం చేయాలి. ఉదయాన్నే లేవలేము అని అంటారు, అప్పుడు పదవి కూడా ఉన్నతమైనది పొందలేరు. దాస-దాసీలుగా అవ్వాల్సి ఉంటుంది. అక్కడేమీ పేడ ఎత్తడం మొదలైనవి చేయవలసి ఉండదు, పాకీవారు ఉండరు. ఇప్పుడు కూడా విదేశాలలో నౌకర్లు మొదలైనవారిని పెట్టుకోరు. దానంతట అదే శుభ్రమైపోతుంది. స్వర్గములో మురికి ఏమీ ఉండదు. ఇకపోతే చండాలులు, దాస-దాసీలు మొదలైనవారు ఉంటారు.

తండ్రి పిల్లలైన మీకు అన్ని రహస్యాలను అర్థం చేయిస్తారు. మీ బుద్ధిలో మొత్తం రాజధాని అంతా ఉంది. మీరు డ్రామాను అర్థం చేసుకున్నారు. మొట్టమొదట ముఖ్యముగా ఈ చక్రాన్ని అర్థం చేయించాలి. ఇప్పుడు ప్రారంభోత్సవం కొరకు గవర్నర్ మొదలైనవారిని పిలుస్తారు. కావున పిల్లలకు డైరెక్షన్ లభిస్తుంది - ప్రారంభోత్సవం చేయించేకన్నా ముందు వారికి ఇలా అర్థం చేయించండి - భారత్ శ్రేష్ఠాచారిగా ఉండేది, ఇప్పుడు మళ్ళీ భారత్ భ్రష్టాచారిగా అయ్యింది, భారత్ యొక్క పూజ్య దేవీ-దేవతలే మళ్ళీ పూజారీ మనుష్యులుగా అయ్యారు అని. ఇది తప్పకుండా అర్థం చేయించాలి. అప్పుడు మీరు సృష్టిచక్రం యొక్క రహస్యాన్ని అర్థం చేయిస్తున్నారని వారు స్వయం కూడా చెప్పాలి. ఎవరికైతే ఇది తెలుసో వారిని త్రికాలదర్శులు అని అంటారు. మనుష్యులై ఉండి ఒకవేళ డ్రామా గురించి తెలుసుకోకపోతే

ఇంకెందుకు పనికొస్తారు? బి.కే.ల పవిత్రత చాలా బాగుంటుందని చాలామంది అంటారు. పవిత్రత అయితే అందరికీ నచ్చుతుంది. సన్యాసులూ పవిత్రంగా ఉంటారు, దేవతలూ పవిత్రంగా ఉంటారు, అందుకే కదా వారి ముందు తల వంచుతారు. కానీ ఇది వేరే విషయం. పతిత-పావనుడు ఒక్క పరమాత్మయే అవ్వగలరు. పతితుల నుండి పావనులుగా మానవ గురువులు తయారుచేయలేరు. ఇది అర్థం చేయించాలి. దయ చేసి ఈ విషయాన్ని మీరు అర్థం చేసుకోండి, అప్పుడు మీ పదవి చాలా ఉన్నతంగా అవుతుంది. భారత్ పూజ్యము నుండి పూజారిగా ఎలా అయ్యింది, భారతవాసీ దేవీ-దేవతలు 84 జన్మలు ఎలా తీసుకుంటారు - దీనిని అర్థం చేయించండి. ఈ విషయాలను తప్పకుండా అర్థం చేయించాలి. క్రైస్టుకు 3,000 సంవత్సరాల క్రితం భారతవాసులు దేవీ-దేవతలుగానే ఉండేవారు. దానిని సుఖధామము, స్వర్గము అని అంటారు. ఆ స్వర్గము ఇప్పుడు నరకముగా అయ్యింది. ఈ విషయాలను మీరు కూర్చొని అర్థం చేయించినట్లయితే మీ మహిమ ఎంతో గొప్పగా జరుగుతుంది. వార్తాపత్రికల వారికి కూడా పార్టీని ఇవ్వాలి. ఇక ఆ తర్వాత వారు నిప్పంటిస్తారా, నీరు పోస్తారా అది వారిపై ఆధారపడి ఉంది. యుద్ధమైతే జరగవలసిందేనని పిల్లలైన మీకు తెలుసు. భారత్ లో రక్తపు నదులు ప్రవహిస్తాయి. ఎప్పుడూ ఇక్కడ నుండే రక్తపు నదులు ప్రవహిస్తూ వచ్చాయి. ఇప్పుడు పార్టిషన్ జరిగినప్పుడు ఎంతమంది మనుష్యులు చెల్లా-చెదురైపోయారు. పూర్తిగా వేరు-వేరు రాజధానులుగా అయిపోయాయి. ఇది కూడా డ్రామాలో నిశ్చితమై ఉంది. పరస్పరంలో కొట్లాడుకుంటారు, ఘర్షణ సృష్టిస్తారు. ఇంతకుముందేమైనా హిందుస్థాన్, పాకిస్థాన్ వేరుగా ఉండేవా. భారత్ లోనే రక్తపు నదులు ప్రవహించనున్నాయి, ఆ తర్వాత నేతి నదులు ప్రవహిస్తాయి. దాని పరిణామం ఎలా ఉంటుంది? కొద్దిమంది మిగిలిపోతారు. పాండవులైన మీరు గుప్త వేషంలో ఉన్నారు.

కావున గవర్నరుకు మొదట పరిచయాన్ని ఇవ్వాలి. ఎవరి వద్దకైతే వెళ్ళేది ఉంటుందో, ముందు వారి మహిమను చేయడం జరుగుతుంది. కానీ వారి గురించి ఏమి రాయబడి ఉందో, ఆ రహస్యము మీకు మాత్రమే తెలుసు. వారేమైనా ఇది ఎండమావుల వంటి రాజ్యమని భావిస్తారా. డ్రామానుసారంగా వారు కూడా వారి ప్లాన్లు తయారుచేసుకుంటూ ఉంటారు. మహాభారతంలో ప్రళయం జరిగినట్లుగా చూపిస్తారు. ఇప్పుడు మహాప్రళయమైతే జరగదు. పిల్లలైన మీలో సృష్టి చక్ర జ్ఞానము నిత్యం ప్రతిధ్వనిస్తూ ఉండాలి. మొదటగా - వీళ్ళకు శిక్షణ ఇచ్చేది ఎవరు అని వారు అర్థం చేసుకోవాలి! అప్పుడు - తప్పకుండా మేము కూడా శివుని పిల్లలమే కదా అని అర్థం చేసుకుంటారు. ప్రజాపిత బ్రహ్మాకు కూడా పిల్లలే. ఇది వంశవృక్షము. ప్రజాపిత బ్రహ్మా గ్రేట్-గ్రేట్ గ్రాండ్ ఫాదర్. మనుష్య సృష్టికి పెద్ద అయితే బ్రహ్మాయే కదా. శివుడిని అలా అనరు, వారిని కేవలం తండ్రి అని అంటారు. గ్రేట్-గ్రేట్ గ్రాండ్ ఫాదర్ అన్న టైటిల్ ప్రజాపిత బ్రహ్మాది. తప్పకుండా గ్రాండ్ మదర్, గ్రాండ్ చిల్డ్రన్ కూడా ఉంటారు. పిల్లలైన మీరు ఈ విషయాలన్నింటినీ అర్థం చేయించాలి. శివుడు ఆత్మలందరికీ తండ్రి. బ్రహ్మా ద్వారా సృష్టిని రచిస్తారు. మనవి ఎన్ని వంశావళులు వెలువడుతాయి అనేది మీకు తెలుసు. గవర్నర్ కు ఇలా అర్థం చేయించాలి - ఇటువంటి ఎగ్జిబిషన్లు అయితే మూల-మూలల్లోనూ పెట్టాలి, మీరు ఏర్పాట్లు చేయించి ఇవ్వండి, మాకైతే చూడండి, మూడు అడుగుల భూమి కూడా లభించదు కానీ మేము తర్వాత విశ్వాధిపతులుగా అయిపోతాము, మీరు ఏర్పాట్లు చేయించి ఇచ్చినట్లయితే, మేము భారత్ ను స్వర్గముగా తయారుచేసే సేవను చేస్తాము. వారు మీకు కొద్దిగా సహాయం చేసినా కానీ అందరూ వారిని గవర్నర్ కూడా బ్రహ్మాకుమార్ అయిపోయారు అని అనడం మొదలుపెడతారు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. గవ్వతుల్యమైన తనువు-మనస్సు-ధనములేవైతే ఉన్నాయో వాటిని తండ్రిపై బలిహారం చేసి తర్వాత ట్రస్టీగా అయి సంభాళించాలి. మమకారాన్ని తొలగించివేయాలి.

2. ఉదయముదయమే లేచి తండ్రిని ప్రేమగా స్మృతి చేయాలి. జ్ఞాన బలము మరియు బుద్ధియోగ బలము ద్వారా మాయపై విజయాన్ని పొందాలి.

వరదానము:- దృష్టి ద్వారా శక్తిని తీసుకునే మరియు శక్తిని ఇచ్చే మహాదానీ, వరదానీ మూర్త భవ

ముున్ముందు వాణి ద్వారా సేవ చేసే సమయం లేక పరిస్థితులు లేనప్పుడు వరదానీ, మహాదానీ దృష్టి ద్వారానే శాంతి యొక్క శక్తిని, ప్రేమ, సుఖము మరియు ఆనందాల శక్తిని అనుభవము చేయించగలరు.

ఏ విధంగా జడమూర్తుల ఎదురుగా వెళ్ళినప్పుడు వారి ముఖము ద్వారా వైబ్రేషన్లు లభిస్తాయి, నయనాల ద్వారా దివ్యత్వము యొక్క అనుభూతి కలుగుతుంది. అయితే మీరు చైతన్యములో ఈ సేవను చేసారు కావుననే జడమూర్తులు తయారయ్యాయి, అందుకే దృష్టి ద్వారా శక్తిని తీసుకునే మరియు ఇచ్చే అభ్యాసము చేయండి, అప్పుడు మహాదానీ, వరదానీ మూర్తులుగా అవుతారు.

స్లోగన్:- ఫీచర్స్ లో (ముఖకవళికలలో) సుఖము, శాంతి మరియు సంతోషము యొక్క మెరుపు ఉన్నట్లయితే అనేక ఆత్మల ఫ్యూచర్ ను (భవిష్యత్తును) శ్రేష్ఠముగా తయారుచెయ్యగలరు.